## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

**ఒంగోలు, ప్రభాతవార్త**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026 కొరకు అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని తెలియజేశారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో కనీసం 10 సంవత్సరాల రెగ్యులర్ సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అర్హులు అన్నారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు అనర్హులన్నారు. దరఖాస్తులను జూన్ 16వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://నేషనల్‌అవార్డ్‌టూటీచర్స్. ఎడ్యుకేషన్. జీఓవీ. ఇన్ ద్వారా మాత్రమే సమర్పించాలన్నారు. జిల్లా, రాష్ట్ర కమిటీల పరిశీలన అనంతరం, జాతీయ స్థాయి స్వతంత్ర జ్యూరీ తుది విజేతలను ఎంపిక చేస్తుంది. జిల్లాలోని అర్హత గల ఉపాధ్యాయులు అందరూ నేషనల్ టీచర్స్ అవార్డ్స్-2026కి దరఖాస్తు చేసుకోవాలని ప్రకాశం జిల్లా, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలియజేశారు.

## ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీమంత్రి శిద్దా

**ఒంగోలు, ప్రభాతవార్త**




రాజమండ్రి సమీపంలో బండాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బి.ఆర్.వి.పి.ఎల్, క్యాంపాసూర్ బాటిలింగ్ యూనిట్ ప్రారంభ వేడుకలలో ముఖ్య అతిధిగా రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మన్యం ఫణికుమార్, బి.ఆర్.వి.పి.ఎల్.యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి నివాళులు

**చీమకుర్తి, జూన్ 17, ప్రభాతవార్త**



ప్రముఖ సినీ నటుడు బూచేపల్లి కమలాకర్ రెడ్డి జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. చీమకుర్తి లోని బూచేపల్లి కమలాకర్ రెడ్డి పార్క్ వద్దకు వారి తల్లి, జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సోదరుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వారి కుమారుడు రిలాసారెడ్డి లు వచ్చారు. తొలుతగా దివంగత మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డికి దీపారాధన చేసి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. పక్కనే ఉన్న కమలాకర్ రెడ్డి ఘాటుకు చేరుకొని నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. మాజీ మంత్రివర్యులు, సంతనూతలపాడు ఇంచార్జ్ మేరుగు నాగార్జున, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు క్రిష్టిపాటి శేఖర రెడ్డి వారి స్నేహితులు రత్నం, రామకృష్ణ బూచేపల్లి అభిమానులు హాజరయ్యారు.

## జూన్ 22 నుంచి 25 వరకు శ్రీగిరి బ్రహ్మోత్సవాలు 26న శ్రీవారి కల్యాణం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**

ఒంగోలు నగర శివారులోని శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం మరో దివ్య తిరుమలగా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత ఆలూరు వెంకట రమణారావు సంకల్పంతో 1971లో ప్రారంభమైన ఆలయ నిర్మాణం 1997లో పూర్తికాగా, గర్భాలయంలో శ్రీవారి అర్చావతార మూర్తిని ప్రతిష్ఠించారు. తిరుమల శ్రీవారిని పోలి ఉండే ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయంలో నిత్య పూజలు, ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఆలయానికి అనుబంధంగా గోశాల నిర్వహణతో పాటు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విద్య, వైద్య రంగాల్లోనూ ఆలూరు వెంకట రమణారావు సేవలు అందించారు.శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 22 నుంచి 25 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు. జూన్ 22న అంకురార్పణ, 23న ధ్వజారోహణం, హనుమంత వాహన సేవ, 24న ఊంజల సేవ, సంగీత కచేరీ, 25న చూర్ణోత్సవం, చక్రస్నానం, శేషవాహన సేవ, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు.జూన్ 26న ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం తిరువీధి ఉత్సవం, కోలాట ప్రదర్శనలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని దేవస్థానం నిర్వాహకులు కోరారు.

## ప్రతి గ్రామ సమాఖ్యలో 20 మంది మహిళా వ్యాపారవేత్తల లక్ష్యం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**




ప్రతి గ్రామ సమాఖ్య నుంచి కనీసం 20 మంది మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. రుణాల మంజూరుతో పాటు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న పలు పథకాల్లో మార్పులు చేసి మరింత మంది మహిళలకు లబ్ధి చేకూరేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ, జీవనోపాధుల ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ నెల నుంచి అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియ ఇటీవల పూర్తయ్యింది. సభ్యులకు ఎంత రుణం అవసరం, ఎప్పుడు కావాలి, ఏ రంగంలో వ్యాపారం చేయాలనుకుంటున్నారు వంటి వివరాలను సేకరించారు. వీటి ఆధారంగా కొత్త రుణాల మంజూరుకు చర్యలు చేపడుతున్నారు.వ్యవసాయం, ఉద్యానవనం, ట్రేడింగ్, చేపల పెంపకం, హస్తకళలు, చేతివృత్తులు తదితర 20 రంగాల్లో దాదాపు 180 రకాల వ్యాపారాలను చేపట్టేందుకు అవకాశం కల్పించారు. స్వయం సహాయక సంఘంలోని ప్రతి సభ్యురాలు వ్యక్తిగతంగా రుణం పొందేలా విధానాలను రూపొందించారు. ఈ ఏడాది ప్రకాశం జిల్లాలోని 10, 532 సంఘాలకు చెందిన 93,219 మంది సభ్యులకు రూ.1,607.38 కోట్ల మేర రుణ అవసరం ఉన్నట్లు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇందులో కనీసం రూ.800 కోట్ల మేర రుణాలతో వివిధ జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 44,868 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వాటి పరిధిలో లక్షలాది మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి తదితర పథకాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. వీటితో పాటు సంఘాల పొదుపు నిధులను కూడా అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశం కల్పించారు. పొదుపు ఖాతాల్లో జమయ్యే మొత్తాలపై వచ్చే వడ్డీ సంఘాలకే జమ అవుతుండటంతో మహిళల ఆర్థిక బలోపేతానికి మరింత తోడ్పాటు లభిస్తోంది.

## జులై4న అద్దంకిలో పల్నాడు హాస్పటల్ ప్రారంభం

**- డాక్టర్ చింతలపూడి వెల్లడి**

**అద్దంకి, జూన్ 17, ప్రభాతవార్త :**



అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో వచ్చేనెల 4వ తేదిన పల్నాడు హాస్పటల్‌ను ప్రారంభిస్తున్నట్లు పిడుగురాళ్ళ లోని పల్నాడు హాస్పటల్ వైద్యులు డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ వెల్లడించారు. నాణ్యమైన వైద్యం అందరి హక్కు అని, ఈ నేపధ్యంలో అందరికీ అందుబాటులో వుండేవిధంగా హాస్పటల్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మీ ఆరోగ్యమే మా ప్రాధాన్యత, అత్యూత్త వైద్యసేవలు ఇప్పుడు అద్దంకిలోనే అందుబాటులోకి జులై 4 నుండి వస్తున్నట్లు ఆయన వివరించారు. అత్యవసర పరిస్థితులు, ప్రసూతి సంరక్షణ, శస్త్రచికిత్సలుతోపాటు వైద్య విభాగంలో మరెన్నో వైద్యసేవలను పల్నాడు హాస్పటల్ ద్వారా అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన వివరించారు.

## సి.ఐ.టి.యు. ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**అద్దంకి , జూన్ 17, ప్రభాతవార్త :**



మున్సిపాలిటీలలో పౌరసేవల ప్రైవేటీకరణ జీఓను వ్యతిరేకిస్తూ బుధవారం అద్దంకి మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది మున్సిపల్ మంత్రి నారాయణకు సమర్పించేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జి.ఒ.నెం.975, 673లను వెంటనే నిలుపుదల చేయాలని, మున్సిపల్ కార్మికులందరినీ, పర్మినెంట్ చేయాలని, పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్‌లపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అద్దంకి కార్యదర్శి ఉసురుపాటి శామ్యూల్, జాన్, జి పెద మార్కు, బి అశోక్, ఎం కోటయ్య, ఏ రవితేజ, ఎం ప్రేమ్ తదితర మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## టెన్నిస్ కోర్టు హైట్ పెంపు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలులో టెన్నిస్ కోర్టు హైట్ పెంచే కార్యక్రమం బుధవారం శుభారంభంగా జరిగింది. పలువురు సభ్యులు కొబ్బరికాయలు కొట్టి పూజలు కార్యక్రమాలు చేపట్టి హైట్ పెంచే కార్యక్రమాన్ని చేపట్టారు. క్రీడల పట్ల ఆసక్తి కనపరచాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్రీడలు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చంద్రమోహన్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ రాఘవ, ట్రెజరర్ మస్తాన్, టెన్నిస్ ప్లేయర్స్ రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, తిరుమల, లక్ష్మన్, మురళి, ఆర్మీ శ్రీనివాస్, రామారావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# మామూళ్ల మత్తు.. తనిఖీల తంతు..!

**- బీఈడీ కళాశాలల నిర్వాహకులతో కుమ్మక్కు**

**ఒంగోలు, ప్రభాతవార్త**

భావిపౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను తయారు చేయడంలో బీఈడీ కళాశాలలది కీలక పాత్ర. ఇలాంటి కళాశాలలను కొందరు సంపాదనే లక్ష్యంగా ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. సరైన వసతులు లేకున్నా, సరిపడా బోధన సిబ్బంది లేకున్నా భారీగా ఫీజులు వసూళ్లు చేస్తూ మొక్కుబడిగా తరగతులు నిర్వహించి పట్టాలు ఇచ్చి పంపించేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బీఎడ్ కళాశాలల ప్రత్యేకత గురించి ఎంత చెప్పిన తక్కువే. భౌతికంగా కనిపించవు. కాగితాల్లో మాత్రం కార్యకలాపాలు సాగిపోతుంటాయి. అధ్యాపకులు కానరారు. విద్యార్థులు సైతం చివర పరీక్ష హాల్లో దర్శనమిస్తుంటారు. ఆయా యాజమాన్యాలు కాసులు ఎరవేసి ఏటా అనుమతులు పునరుద్ధరించుకుంటాయి. ఈ ఏడాది అదే తంతు సాగేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో మొత్తం 110 బీఎడ్ కళాశాలలు ఉన్నాయి. ఏటా వీటిని తనిఖీ చేసి అనుమతులు మంజూరు చేయాలి. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలోనే ఈ ఏడాది కళాశాలల తనిఖీ జరుగుతుందని, అనుమతులు తీసుకోవాలంటే బోధన సిబ్బంది ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అన్న ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు కొంత మంది అధ్యాపకుల పేర్లు కాగితాలపై రాసి అనుమతులు తెచ్చుకునే వారు. తనిఖీ బృందాలకు ముడుపులు సమర్పించుకునే వారు. ఈ సారి ఆ పరిస్థితి లేకపోవడంతో అడ్డదారి ప్రయత్నాలపై దృష్టి సారించినట్లు సమాచారం. బీఎడ్ కళాశాలలో బోధించాలంటే పీజీతో పాటు ఎంఈడీ చేసి ఉండాలి. ఆన్‌లైన్‌లో వారి వివరాల నమోదుకు ఆధార్ తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో కొన్ని యాజామాన్యాలు తెలంగాణలోని బీఎడ్ కళాశాలల సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నట్లు



చూపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఆ విద్యాసంస్థలతోనూ సంప్రదింపులు సాగిస్తున్నట్లు సమాచారం. గత ఏడాది అనుమతుల విషయంలోనూ ఇదే పరిస్థితి ఏదురైంది. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశం అంటూ ముందుగా ప్రవేశాలు కానించేశారు. తరువాత తనిఖీల ఊసే లేకుండా పోయింది. కళాశాల నిర్వాహణ విషయంలో ఫిర్యాదులు వెల్లువెత్తిన పరీక్షల ముందు వరకు ఏ విషయం తేల్చకుండా నాన్చుతు వచ్చారు. చివర్లో విద్యార్థులు నష్టపోతారంటూ పరీక్షలకు అనుమతులు తెచ్చుకున్నారు. ప్రతి ఏటా చివరి నిమిషం వరకు ఇలా తెలివిగా వ్యవహారిస్తూ యాజమాన్యాలు తమ పని కానిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు సైతం వీరికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తనిఖీల సమయంలో భవనాలు, పర్నీచర్, సిబ్బంది లేకపోయినప్పటికి బీఎడ్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని కమిటీ అధికారులు నిర్ధారణ పత్రం ఇవ్వడం గమనార్హం. పలు కళాశాలల్లో పూర్తి స్థాయిలో భవనాలు, ఫర్నీచర్ లేకపోయినప్పటికి అనుమతులు మంజూరు చేయాలని తనిఖీ బృందం సభ్యులు సిఫార్సు చేయడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొందరు రాష్ట్ర ఉన్నత విద్యామండలితో పాటు విద్యాశాఖ మంత్రి పేషీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చాలా కళాశాలలకు భవనాలు, ఫర్నీచర్, ల్యాబ్‌లు లేకున్నా తనిఖీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చాలా బీఎడ్ కళాశాలలకు సరైన బిల్డింగ్ కూడా లేవని తెలిసింది. ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించనటువంటి వాటి నుంచి డబ్బులు ఇచ్చేలా డీలింగ్ కుదిరినట్లు ఆరోపణలు ఉన్నాయి. భవనాలు, ఫర్నీచర్, సిబ్బంది లేని కళాశాలలకు అఫిలియేషన్ మంజూరుకు ప్రాంతాన్ని బట్టి లక్ష రూపాయల నుంచి రూ.1.50 లక్షల వరకు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా భావితరాల వారికి విద్యాబుద్ధులు నేర్పించే ఇలాంటి బీఎడ్ కళాశాలల మీద చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

## విజయోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే ఉగ్ర

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ పాలనకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా ఈ నెల 18న ఒంగోలు నగరంలోని ఎస్‌జీవీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహిం చనున్న విజయోత్సవ సభకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, కనిగిరి ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసిం హారెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభ నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా స్టేజ్, సీటింగ్, ప్రదర్శన స్టాల్స్, బందోబస్తు తదితర ఏర్పాట్లను పటిష్ఠంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించేలా కార్యక్రమాన్ని రూపొం దిస్తున్నట్లు తెలిపారు. సభకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు నిర్దేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు.



అంతకుముందు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026 కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక తెలిపారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర విద్యాశాఖ ఈ అవార్డులను ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తోందన్నారు.గుర్తింపు పొందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో కనీసం 10 సంవత్సరాల రెగ్యులర్ సేవ పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డులకు అర్హులు కాదని స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, వినూత్న బోధనా పద్ధతులు, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి, సమాజ సేవ తదితర అంశాలను ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 16 నుంచి జూలై 13, వరకు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని వెల్లడించారు. దరఖాస్తులను కేంద్ర విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక వెబ్ పోర్టల్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉపాధ్యా యుల సేవలకు గుర్తింపు లభించే ఈ ప్రతి ష్ఠాత్మక అవార్డుకు ప్రకాశం జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు, హెచ్‌యం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖా ధికారి సి.వి. రేణుక కోరారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు కూడా అర్హులైన ఉపాధ్యాయులను ప్రోత్సహించి దరఖాస్తు ప్రక్రియ లో సహకరించాలని ఆమె సూచించారు.

## మహిళల మనోభావాలు దెబ్బతినే వ్యాఖ్యలు చేసినవాహిని సహించేది లేదు

**- హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ టిడిపి కార్యాలయంలో మహిళా నేతల సమావేశం**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

మంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగు మహిళ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు..ఈ సమావేశంలో ఆర్ల వెంకటరత్నం, కుసుమకుమారి, టి. అనంతమ్మ, రావుల పద్మజ, బీరం అరుణారెడ్డి, పసుపులేటి సునీత, పెద్దిశెట్టి వరలక్ష్మి, అజీ మున్నీసా తదితర తెలుగు మహిళ నాయకులు పాల్గొని మాట్లాడారు. మహిళల వ్యక్తిత్వాన్ని, దుస్తులను, అలంకరణను లక్ష్యంగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయడం దురదృష్టకరమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి వ్యాఖ్యలకు స్థానం లేదని వారు పేర్కొన్నారు. హోంమంత్రి అనిత ఇటీవల కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సంక్షేమ కార్యక్రమాలు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరించారని, ఆ అంశాలపై రాజకీయంగా స్పందించలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం వైసీపీ నాయకుల వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హోంమంత్రి అనిత మేకప్, లిప్‌స్టిక్, నెయిల్ పాలిష్, చీర ధరించే విధానం వంటి వ్యక్తిగత అంశాలపై చేసిన వ్యాఖ్యలు ఒక మహిళను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని మహిళలందరినీ అవమానించినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు ఎలా ఉండాలి, ఎలా దుస్తులు ధరించాలి అనేది వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయమని, వాటిని రాజకీయ విమర్శలకు వేదికగా ఉపయోగించడం మహిళా సమాజాన్ని కించపరిచే చర్యగా అభివర్ణించారు. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, సమాజం సహించదని నాయకులు హెచ్చరించారు. మహిళల మనోభావాలను దెబ్బతీసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేయాలని కోరారు. క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా తెలుగు మహిళ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు



## పంటలపై ఎల్‌నినో ప్రభావం

**ముండ్లమూరు, జూన్ 17, ప్రభాతవార్త**


మండలంలోని పసుపుగల్లు గ్రామం రైతు సేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి వారి ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం సమతుల్య ఎరువుల వాడకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి మన దేశంలోని జిల్లాలో అధిక రసాయన ఎరువులు వాడుతున్న జిల్లాలో మన ప్రకాశం జిల్లా కూడా ఉంది.

# ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

**- ఒక్క గ్రానైట్ గనిలోకి అడుగు పెట్టలేదు**
**- కాఫీ తాగినంత సేపట్లో ఉపన్యాసం ముగించారు**

**బల్లికురవ జూన్ 8( ప్రభాతవార్త)**

23వ గనుల భద్రత వారోత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీ నుండి గనులలో తనిఖీలు ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు హైదరాబాద్ జోన్ 3 సంచాలకులు కే.వేణుగోపాలస్వామి, డి.ఎం.ఎస్.కౌశిక్ గుప్తా, డి.డి ఎమ్మెస్ శివశంకర్ శివశంకర్లు బల్లికురవ వీటీసీ భవనానికి విచ్చేశారు. ఒక జెండాను ఎగరవేసి, కాఫీ తాగినంత సేపట్లో ఉపన్యాసం ముగించేసి, ఒక్క గ్రానైట్ గనిలోకైనా అడుగు వేసింది లేదు ., వచ్చినంత సేపట్లో వెనుతిరిగి ప్రయాణమయ్యారు. ఉపన్యాసం మాత్రం ఒకాయన కార్మికులను తమ కుటుంబ సభ్యుల మాదిరిగా చూడాలంటాడు, ఇంకొకరు జీరో శాతం ప్రమాదాలు ఉండాలంటాడు, మరొకరు కార్మికుల హక్కులను కాపాడాలంటారు. ఒక్కరూ ఒక గనిలోకి అడుగు పెట్టలేదు. ఇక కార్మికుల భద్రత వీరికేం పడుతుంది . ప్రారంభ ఆర్భాటాలు, అధికారుల ప్రసన్నతల కోసం హంగామా చేయటం, ఒక వారం రోజులు పాటు ట్రేడ్ పరీక్షలు నిర్వహించటం, మరో వారం రోజులు పాటు గనులలో, నామమాత్రపు తనిఖీలు నిర్వహించడం. ముగింపు రోజున అందరినీ సంతృప్తి పరిచే రీతిలో యాజమాన్య ప్రతినిధులు తమదైన శైలిలో పురస్కారాలు కొనసాగుతాయి. గడిచిన 22 సంవత్సరాలుగా గనుల భద్రత వారోత్సవాలు జరిగిన తీరు అదే, ప్రస్తుతం జరగబోయేది అదే. గనులలోని కార్మికులకు కానీ, ఉద్యోగులకు కానీ అదనంగా సమకూరే సౌకర్యాలు మాత్రం షరా మామూలే. హవాయి చెప్పులు, నెత్తి మీద టోపీ. కానీ గనుల చట్టం 1952లో చట్టం నెంబర్ 35



కొన్ని కీలక శాసనాలు చేసింది. గనులలో పని చేసే వ్యక్తుల ఆరోగ్యం భద్రత, సంక్షేమం నిర్వహించే ఉద్దేశంతో ఈ చట్టాన్ని అమలు చేశారు. నిర్దిష్ట పని గంటల విధానం ఒక్క గనిలోనూ అమలు కాదు. మౌలిక వసతుల కల్పన, ప్రమాదాల నివారణ, వైద్య సంరక్షణ లు, మచ్చుకైన కానరావు. గనులలో పని చేసే వ్యక్తులను కాపాడటానికి చట్టపరమైన రక్షణల ఆవశ్యకత నిరంతర ప్రక్రియగా చెబుతున్నప్పటికీ అది ఆచరణకు మాత్రం నోచుకోదు. పర్యావరణ అనుమతులు కోరుతూ నిర్వహించే గ్రామ సభలను సైతం గుట్టు చప్పుడు కాకుండా తమ అనుకూలమైన వ్యక్తులతో నిర్వహించటం ఆనవాయితీగా మార్చుకున్నారు. అనుక్షణం ప్రమాదాలతో సహవాసం చేస్తూ, పరాయి రాష్ట్రాల నుండి వలస వచ్చిన కూలీల, బ్రతుకులు కొన్ని సందర్భాలలో తెల్లారిపోతున్నాయి. ఒకవైపు భద్రతా వారోత్సవాలు జరుగుతుంటే, మరొకవైపు ప్రమాదాలు కొనసాగుతుంటాయి. గ్రానైట్ వ్యర్థాలతో ఏర్పాటు చేసిన కృత్రిమ కొండలు నివాస గృహాల నడుమ ఉండటం, ఆ పక్కనే ఉన్న రహదారిలోనే దైనందిక జీవితంలో ప్రజలు ప్రయాణించటం వారి అవసరాలను తెలియజేస్తుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు బండ పైన బండ పెట్టి ఏర్పాటుచేసిన కృత్రిమ కొండలు కిందకు జారితే, పక్కన ఉన్న నివాస గృహాల పరిస్థితి ఏమిటో ఒక్క అధికారైన ఆలోచించాడా. స్థానిక జమ్మూ గ్రానైట్ గనిలో కొండ శిఖరాన పనులు జరుగుతుంటే, ఒకవైపు సత్య కృష్ణ హమారా ఒకవైపు లక్ష్మీ గ్రానైట్స్ ఇంకొకవైపు గంగాభవాని గనులలో దిగువ భాగాన పనులు కొనసాగుతుంటాయి, ఎగువ నుండి రాళ్లు పడి కార్మికుల మృతి చెందిన సందర్భాలు కూడా కోకొల్లలు, ఇంతటి నిర్లక్ష్యపు గని పనులు కొనసాగుతున్న కన్నెత్తి చూడని అధికారులు కార్మికుల క్షేమం గురించి మాట్లాడుతుంటారు. గత ఏడాది ఆగస్టులో సత్య కృష్ణ క్వారీలో కార్మికులు మృతి చెందిన సందర్భంలోనూ ఎగువన జమ్మూ గనిలో పనులు. దిగువ క్వారీలో ప్రమాదం జరిగింది. గురిజేపల్లి గనుల మేనేజర్లు బల్లికురవ లోను, బల్లికురవ మేనేజర్లు గురిజేపల్లి గనుల లోను, తనిఖీలు నిర్వహిస్తున్నంత కాలం కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాలే. తనిఖీ బృందాలలో ఆర్డీవోస్థాయి అధికారుల పర్యవేక్షణ కొనసాగితేనేగనులలోని లోపాలుగంపలు గంపలుగా వెల్లడవుతాయి.

# ఇసుక మాఫియాకు అధికారుల అండా..!

- రైతుల తీవ్ర ఆగ్రహం
- అక్రమ ఇసుక తవ్వకాలపై నివేదిక వివాదం
- క్వారీల్లో ఆనవాళ్లు స్పష్టమే.. రిపోర్ట్‌లో మాత్రం ఏమి లేదు
- మైనింగ్ అధికారుల నివేదికపై రైతుల సంతకాలకు నిరాకరణ
- 2 వేల ఎకరాల పంట భూములకు ముప్పు

## అక్రమ ఇసుక తవ్వకాలపై రైతులు ఆందోళన





**చీరాల టౌన్, జూన్ 17, ప్రభాతవార్త**

చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాల వ్యవహారం మరోసారి వివాదస్పదంగా మారింది. రాయల్ మెరైన్ కంపెనీ సమీపంలోని సర్వే నంబర్లు 529, 689, 685ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల్లో భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపించారు. ఈ తవ్వకాల వల్ల పెద్ద పెద్ద గుంతలు, చెరువులు ఏర్పడి పంట పొలాల్లో నీరు నిల్వ కాక సుమారు 2వేల ఎకరాల సాగుభూమి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంట కాలువలను కూడా పూడ్చివేశారని, ఈ భూములన్నీ గతంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన భూములేనని రైతులు పేర్కొన్నారు. అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేసి తమ పంట పొలాలను కాపాడాలని కోరుతూ మే 8న రైతులు కలెక్టర్‌కు గ్రీవెన్స్ లో వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం మైనింగ్ శాఖ అధికారులు, కావూరివారిపాలెం, వేదులపల్లి వీఆర్వోలను వెంటబెట్టుకొని క్వారీల పరిశీలనకు వచ్చారు. అయితే అధికారుల రాక విషయం తెలుసుకున్న ఇసుక వ్యాపారులు అక్కడి నుంచి తొందరగా వెళ్లిపోయినట్లు రైతులు తెలిపారు. ఒక టిప్పర్ మాత్రమే క్వారీ సమీపంలో ఉండగా, మరో ఆరు టిప్పర్లు వెదులపల్లి- బాపట్ల రహదారి మార్జిన్‌లో నిలిపివేసినట్లు రైతులు పేర్కొన్నారు. క్వారీల వద్ద రెండు ప్రొక్లెయిన్‌లు, చెట్ల చాటున మరో రెండు ప్రొక్లెయిన్లు, ఒక జనరేటర్, ఇసుక వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న గుడిసెలో కుర్చీలు, పరుపుమంచం వంటి ఆనవాళ్లు ఉన్నప్పటికి అధికారుల నివేదికలో వాటి ప్రస్తావన లేకపోవడం పట్ల రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రాంతంలో టికెట్(చెక్‌పోస్టు) ఏర్పాటు చేయాలి, పోలీసు చర్యలు తీసుకోవాలి అనే సూచనలు మాత్రమే నివేదికలో నమోదు చేశారని, ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టుల్లో కూడా అధికారులు విధులు నిర్వహించడం లేదని రైతులు ఆరోపించారు. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని తెలిపారు. రోజు భారీ ఎత్తున ఇసుక రవాణా జరుగుతున్న ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికి వాటిని విస్మరించి నివేదిక తయారు చేయడం సరైన విధానం కాదని రైతులు మండిపడ్డారు. దీనిపై మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లతో రైతులకు వాగ్వాదం చోటుచేసుకుంది. మేము వచ్చిన సమయానికి తవ్వకాలు జరగలేదు కాబట్టి అలాగే నివేదిక ఇస్తాం అని అధికారులు చెప్పినట్లు రైతులు వెల్లడించారు. దీంతో అధికారుల నివేదికపై సంతకాలు చేయడానికి రైతులు నిరాకరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.కొండయ్యతో పాటు రైతులు దేవల రమణయ్య, దానియేలు, బలగాని సాంబయ్య, కాటి దేవదానం, దేవుళ్ల శ్రీను, లూథర్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానజ్యోతిని వెలిగించేదే విద్య

- రిటైర్డ్ స్పేస్ సైంటిస్ట్ డాక్టర్ మురళి



**చీరాల, జూన్ 17, ప్రభాతవార్త**

ప్రతి మనిషి జీవితంలో విద్య ద్వారానే విజ్ఞాన కాంతులు వెలుగుతాయని రిటైర్డ్ స్పేస్ సైంటిస్ట్ డాక్టర్ అండ్ మురళీ వరప్రసాద్ తెలిపారు. వేటపాలెం పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంఘ కార్యాలయంలో 465 మంది విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాత పుస్తకాల ద్వారా విద్యా సంపార్జన చేస్తే అది చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. అక్షరమనగా నాశనం లేనిదని అర్థమని వివరించారు. సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆయన అభినందనలు తెలిపారు. సంఘ అధ్యక్షులు పత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న 7ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 465 మంది విద్యార్థులకు యాభై వేల రూపాయల విలువ గల నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక విద్యాభివృద్ధికి సంఘం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపన్యాసకులు కుమారి, కోసనం నాగమాంబ, జ్యోతిర్మయి, దేవాంగ సమితి అధ్యక్షులు డాక్టర్ గౌరబత్తుని రవిబాబు, పట్టబద్రుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ బట్ట మోహన్‌రావు, నున్నా శివ ప్రసాద్, భద్రయ్య, పోతురాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దర్శిలో సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**పర్చూరు, జూన్ 17, ప్రభాతవార్త**

మార్టూరు మండలం ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్ధిదారునికి ఆర్థిక సాయం అందించారు. కుడి కాలు తొంటి విరిగి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న జొన్నలగడ్డ ఎబెనేజర్‌కు అత్యవసర వైద్య చికిత్స కోసం రూ.78,077 సీఎంఆర్ఎఫ్ చెక్కును క్యాంపు కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు కలిసి అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాల బస్సుల డ్రైవర్లకు పర్చూరు ఎస్సై కౌన్సెలింగ్




**పర్చూరు, జూన్ 17, ప్రభాతవార్త**

పర్చూరు మండల పరిధిలోని పాఠశాల బస్సుల డ్రైవర్లకు పర్చూరు ఎస్సై పులి గోపి బుధవారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలను నిర్ణీత వేగంతో నడపడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బస్సుల ఫిట్నెస్, బ్రేకులు,అత్యవసర భద్రతా పరికరాలను తరచుగా పరిశీలించాలని సూచించారు.

## ఎస్సీ కాలనీ సమస్య పరిష్కారంపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు

- డాక్టర్ షేక్ మహబూబ్ వలి వెల్లడి



**మార్కాపురం, జూన్ 17,ప్రభాతవార్త**

మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామ ఎస్సీ కాలనీ వాసులకు ఉపాధి హామీ పనుల్లో అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్‌కు ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 15న కాలనీ వాసుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా,తక్షణ చర్యలు తీసుకుని ఉపాధి హామీ పనులు కల్పించారని పేర్కొన్నారు. కాగా కాలనీలో వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ సమస్యలు ఇంకా ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

## కందులాపురం పంచాయతీలో స్వచ్ఛ పథం కార్యక్రమం



**కంభం, జూన్ 17, ప్రభాతవార్త**

మండలంలోని కందులాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నాగులవరం వెళ్ళే రహదారిలో బుధవారం స్వచ్ఛపథం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపిడిఓ వీరభద్రాచారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛపథం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పారిశుద్య కార్మికులచేత రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలను తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పారిశుద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర ఆలయంలో యోగాంధ్ర కార్యక్రమం





**రాచర్ల, జూన్ 17, ప్రభాతవార్త**

మండలంలోని సత్యవోలు రామలింగేశ్వర ఆలయంలో బుధవారం యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు ఆధ్యాత్మికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఎస్ వెంకటరామిరెడ్డి, తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని,అనారోగ్య సమస్యలను జయించడానికి యోగాసనాలు దివ్య ఔషధముల పనిచేస్తాయన్నారు. క్రమం తప్పకుండా రోజు యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. ప్రాణాయామం,సూర్య నమస్కారాలు, వివిధ రకాల ఆసనాలతో మానసిక రుగ్మతలను పోగొట్టుకోవచ్చున్నారు. ప్రముఖ యోగ గురువులు ప్రధాన శిక్షకుల పర్యవేక్షణలో అధికారులు ఉత్సాహంగా యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు అనధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**వెలిగండ్ల, జూన్ 17, ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి టి.శిల్ప తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని నగదు చెల్లింపులు పూర్తి చేసిన రైతు సేవా కేంద్రాల పరిధిలో గల గ్రామాల రైతులకు రైతు సేవ కేంద్రం సిబ్బంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పచ్చి రొట్ట పైర్ల సాగు వల్ల భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే సమస్యాత్మక భూములలో జీలుగు విత్తనాలు చల్లిన తరువాత పూత దశలో కలియదున్నడం వలన చౌడు సమస్య తగ్గుతుందని తెలిపారు. ఇంకా అవసరం ఉన్న రైతులు రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి రాయితీపై విత్తనాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్.పుల్లయ్య, వీఏఏ షేక్ అజారుద్దిన్, కర్నాటి భాస్కర్‌రెడ్డి, హుస్సేన్‌పురం గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అక్రమ విద్యుత్‌పై విజిలెన్స్ తనిఖీ



**వెలిగండ్ల, జూన్ 17, ప్రభాతవార్త**

అక్రమ విద్యుత్ వాడకంపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం వెలిగండ్ల మండల పరిధిలోని 35 బృందాలుగా విస్తృత తనిఖీలు చేపట్టి అనేక రకాలు కేసులు నమోదు చేయడమే కాకుండా 1,37,250లు జరిమానాలు విధించినట్లు మార్కాపురం జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ ఎస్ఏ కరీమ్ తెలిపారు. 15మంది అధికారులు 75మంది సిబ్బంది కలిసి 35 బృందాలుగా ఏర్పడి మండలంలో విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశారు. మీటర్ ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.23000, అనుమతి కన్నా అధిక కేటగిరి విద్యుత్ వాడుతున్న ముగ్గురికి రూ.12000, అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 40 మందికి రూ.98000 మొత్తంగా రూ.1,37,000 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ సర్వీస్ తనిఖీలు, విద్యుత్ చట్టంకి లోబడి ఉంటాయని అన్నారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9281883901, 9440812358 నంబర్ల ద్వారా పూర్తి సమాచారాన్ని నేరుగా గానీ, వాట్సప్ ద్వారా గాని తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఆర్.ఉమాకాంత్, పామూరు డీఈఈ వి.కృష్ణారెడ్డి, విజిలెన్స్ డీఈఈ పీజీ నారాయణ, ఏఈఈ కే.కోటయ్య, ఏఈ రసూల్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లింగసముద్రం నూతన తహసీల్దార్‌గా కోటేశ్వరరావు



**లింగసముద్రం, జూన్ 17, ప్రభాతవార్త**

లింగసముద్రం మండలం నూతన తహసీల్దార్‌గా ఎం.కోటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కొండాపురం మండల తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వెంటనే వీఆర్వోలు,గ్రామ సర్వేయర్లు, కార్యాలయం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలు లేకుండా చూస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

## శ్రీ కోటా సత్యమాంబ దేవాలయంలో యోగాంధ్ర కార్యక్రమం



**కంభం, జూన్ 17 ,ప్రభాతవార్త**

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ కోటా సత్యమాంబా దేవి ఆలయ ప్రాంగణంలో బుధవారం ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. కంభం ఎంపీడీవో వీరభద్ర చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురువు పిడి సంపంగి సుబ్రహ్మణ్యం పలు యోగ ఆసనాలు, ప్రాణాయామ విధానాలను ప్రదర్శించి చేయించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ యోగ చేయడం ద్వారా మనసుకు ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. ప్రతిఒక్కరు యోగ సాధనను జీవనశైలిగా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి. తులసమ్మ, నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, ఓబుల్ రెడ్డి, ఎంఈఓ అబ్దుల్ సత్తార్ అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు దాడి - 8 మంది అరెస్టు



**కందుకూరు జూన్ 17, ప్రభాతవార్త**

మండలంలోని పలుకూరు శివార్లలో బుధవారం నిర్వహిస్తున్న కోడిపందేలపై నిఘా విబాగం పోలీసుల దాడి చేశారు.8మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.10,050లు నగదు, 3కోళ్లు,5 సెల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో ఇటీవల జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఏర్పాటుచేశారు.ఇందులో బాగంగా ఇన్‌చార్జ్ ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్సై చెంచయ్య,ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా మరియు సిబ్బంది కలసి దాడిచేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.నేరపూరిత సమాచారం పోలీసులకు అందించాలని ఆయన కోరారు. నిందితులుపై చట్టపరమైన చర్యల నిమిత్తం కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# నిలిచిపోయిన పొగాకు వేలం ప్రక్రియ



**కందుకూరు జూన్ 17, ప్రభాతవార్త**

కందుకూరు పొగాకు వేలం కేంద్రాలలో బుధవారం జరుగుతున్న క్రయవిక్రయాల వేలంప్రక్రియలో గిట్టుబాటు ధర రావడంలేదని రైతులు ఆందోళన చేపట్టారు. పామూరురోడ్‌లోని 27వ,కనిగిరి రోడ్డులోని 26వ పొగాకు వేలం కేంద్రాలలో వేలంప్రక్రియను రైతులు నిలిపివేశారు.బ్రైట్ పొగాకును కేజీ1కి రూ.160 నుండి రూ.170 వరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆగ్రహించారు.గిట్టుబాటు ధర ఇచ్చేంతవరకు వేలం జరగనివ్వబోమని నిరసన తెలిపారు.కనిగిరి రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లను పెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాసేపు ట్రాపిక్ భారీగా నిలిచిపోయింది.

## చల్లగుండయ్యా - ఎమ్మెల్యేకి మహిళల ఆశీర్వాదం



**కందుకూరు జూన్ 17 ప్రభాతవార్త**

పదికాలాలుపాటు చల్లగ ఉండయ్యా అని పలువురు సీనియర్ మహిళలు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆశీర్వదించారు. బుధవారం కందుకూరు లో రెండేళ్ల కూటమిపాలన రెండేళ్ల విజయోత్సవ సభ జరిగింది. ఈ సభకు పలు గ్రామాలనుంచి మహిళలు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఎంతో మందికి సేవాకార్యక్రమాలు చేస్తున్ననాగేశ్వరరావు పదికాలాలపాటు చల్లగ ఉండాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆయను ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు వార్త ప్రతినిదితో తెలిపారు.

# చురుగ్గా బీఎల్వోల ఇంటింటి సర్వే



**తాళ్లూరు, జూన్ 17, ప్రభాతవార్త**

మండల పరిధిలోని తూర్పు గంగవరం, సోమరవప్పాడు గ్రామాల్లో బుధవారం బూత్ లె వల్ ఆఫీసర్లు,ఎన్యూమరేటర్లు ఓటర్ల నమోదుపై ఇంటింటి సర్వే నిర్వహించారు.ఈ సర్వేను తహసీల్దారు బచ్చల వెంకట రమణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి సంతకాల సేకరణ చేశారు.వీటిలో ఓటర్ల నివాసాలు,కుటుంబ సభ్యుల వివరాలను పొందు పరచాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీఎల్ వో లు, ఇన్యూమరేటర్లు ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వే నిర్వహించారు.బీఎల్‌వోలు గంగా భవాని, కళ్యాణ్ పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ పోస్టులు పూర్తిగా భర్తీ చేయాలి



**సింగరాయకొండ, జూన్ 17, ప్రభాతవార్త**

ఉద్యోగ నియామకాలలో ఓపెన్ కేటగిరీ మెరిట్‌లో ఎంపికైన బీసీ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలోనే పరిగణించి, వారి వల్ల ఖాళీ అయ్యే బీసీ రిజర్వేషన్ పోస్టులను ఇతర అర్హులైన బీసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఏపీ బీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఏపీ డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కోరారు.బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీ సమస్యలపై మాజీ ఆంధ్రప్రదేశ్ డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య, మసూద్ అలీ, నూకసాని వెంకటేశ్వర్లు కమిషన్ చైర్మన్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ రిజర్వేషన్ విధానం ద్వారా వెనుకబడిన వర్గాలకు గరిష్ట అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో ఎంపికైన బీసీ అభ్యర్థులను రిజర్వేషన్ కోటాలో లెక్కించడం వల్ల ఇతర అర్హులైన బీసీ నిరుద్యోగులు అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపెన్ కేటగిరీలో ఎంపికైన వారిని అదే కేటగిరీలో కొనసాగించి,బీసీ రిజర్వేషన్ పోస్టులను పూర్తిస్థాయిలో బీసీ వర్గాలకు అందేలా మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.ఈ విధానం అమలైతే సామాజిక న్యాయం,సమాన అవకాశాలు, రిజర్వేషన్ విధానం ఉద్దేశం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అభిప్రాయపడ్డారు.అనంతరం ముఖాముఖి కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ బీసీ రక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు గ్రామ స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టసభల్లో తీర్మానాలు చేయాలని కమిషన్‌ను కోరారు. అలాగే మన్నేరు వాగుపై చెక్‌డ్యామ్ నిర్మిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు.వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్. నిర్మల జ్యోతి, తహసీల్దార్ ఎన్ వి బి రాజేష్, ఎంపీడీఓ డీ జయమణి, బీసీ నాయకులు, బీసీ ఉద్యోగుల సంఘం సభ్యులు, బీసీ నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



**తాళ్లూరు,జూన్ 17,ప్రభాతవార్త**

డ్రగ్స్ మత్తు పానీయం కాదు డేంజర్ అని దర్శి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కూరకుల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి, డ్రగ్స్ రహితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రక్స్, గంజాయి సేవించటం వల్ల జీవితాలు ప్రమాదంలో పడతాయన్నారు. మారక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనార్థాల గురించి వివరించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైఎస్సార్ కె.ప్రసాదు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్మిట్ రూముల్లోనే మద్యం సేవించాలి



**సింగరాయకొండ, జూన్ 17, ప్రభాతవార్త**

సింగరాయకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూముల్లో మాత్రమే మద్యం సేవించాలని ఎక్సైజ్ సీఐ ఎం.శివకుమారి సూచించారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె ఈ విషయాన్ని తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, అలా చేసిన వారిపై ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే అనధికారికంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు 17 ఓపెన్ కన్సంప్షన్ కేసులు, 124 అనధికార మద్యం కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఒక ఎన్‌డీపీఎస్ (విదిశిలీ) కేసు, ఒక గంజాయి కేసును నమోదు చేసి నిందితులపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు మద్యం వినియోగానికి సంబంధించిన నిబంధనలను పాటించాలని, చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# అతిసార వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం



**సింగరాయకొండ, జూన్ 17, ప్రభాతవార్త**

అతిసార (డయేరియా) వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ లావణ్య సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అతిసార నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత తాగునీరు, అపరిశుభ్రమైన ఆహారం, పరిశుభ్రత లోపం వల్ల డయేరియా వ్యాధి వస్తుందని తెలిపారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే నిరక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.జూన్ 16 నుంచి జూలై 31 వరకు ఐదేళ్లలోపు చిన్నారుల్లో అతిసార వ్యాధి నివారణపై అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అతిసార లక్షణాలు ఉన్న పిల్లలకు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలను 14 రోజుల పాటు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య,ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, కూనపురెడ్డి రాజమ్మ, ఆరోగ్య సహాయకులు సుభాకర్, విజయమ్మతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నరు.

## నేతాజీ జీవితాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి



**మార్టూరు, జూన్ 17, ప్రభాతవార్త**

మండలంలోని ఇసుక దర్శి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో విశ్రాంత లెక్చరర్ తోటకూరి వెంకట నారాయణచే నేతాజీ సుభాష్ చంద్రబోస్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శైలజ మాట్లాడుతూ ఇలాంటి నేతలు గురించి మనం తెలుసుకోవాలని ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. వెంకట నారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యఉద్యమంలో ఆయన చేసిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల సంరక్షణా కేంద్రాలు






**సీఎస్‌పురం, జూన్ 17, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల సంరక్షణా కేంద్రాలని,చిన్నారుల భవిష్యత్తు చదువులకు పునాదుల వంటివని ఐసీడీఎస్ వెలిగండ్ల సీడీపీవో షేక్ ఆశాబేగం అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో సీఎస్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త కేంద్రం పరిధిలోని ఇంటింటి సర్వే నిర్వహించి 3 సంవత్సరాల వయస్సు గల పిల్లలను విధిగా అంగన్‌వాడీ ఫ్రీ స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం, ఇతర వస్తువులపై పిల్లల తల్లిదండ్రులకు వివరించాలన్నారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృపావరం,యాక్టింగ్ సూపర్‌వైజర్ సరళారెడ్డి పలువురు పాల్గొన్నారు.

# కనిగిరి ప్రజలకు మరో ఆరోగ్య వరం

**- దేవాంగనగర్‌లో రూ.1.18 కోట్ల అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం**

**- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషితో అందుబాటులోకి ఆధునిక వైద్య సేవలు**





**కనిగిరి, జూన్ 17, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మున్సిపాలిటీలోని 11వ వార్డు దేవాంగనగర్‌లో నేషనల్ హెల్త్ మిషన్ గ్రాంట్ ద్వారా రూ.1.18 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరువతో నిర్మాణం పూర్తయిన ఈఆరోగ్య కేంద్రాన్ని జిల్లాఇన్‌చార్జిమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర విద్యుత్,ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరుఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి పట్టణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. దేవాంగనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య సేవలు, తల్లి – శిశు సంరక్షణ, వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరింత చేరువ కానున్నాయని తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్య రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కనిగిరిలో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య కేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, షేక్ ఇస్మాయిల్, తెలుగుయువత అధ్యక్షుడు అచ్చాలరవి, ఉండేలా శ్రీనివాసరెడ్డి, షేక్‌రెహమాన్, కొల్లూరి శ్రీనివాసులు, రాచమల్ల శ్రీనివాస్‌రెడ్డి, కత్తులపల్లి వెంకటేశ్వరరెడ్డి, పాతూరు నాగ, పెన్నా వెంకటేశ్వర్లు, కనమర్ల కృష్ణారెడ్డి, కేఎస్ఎస్ కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు, వైద్యసిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దేవాంగనగర్‌కు మెరుగైన మౌలిక వసతులు

**- రూ.32.72 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల ప్రారంభం**



**కనిగిరి, జూన్ 17, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలోని 11వ వార్డు దేవాంగనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.32.72లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను బుధవారం ఘనంగా ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర విద్యుత్, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేవాంగనగర్‌లో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లతో రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, షేక్ ఇస్మాయిల్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, ఉండేలా శ్రీనివాసరెడ్డి, షేక్ రెహమాన్, కొల్లూరి శ్రీనివాసులు, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, కత్తులపల్లి వెంకటేశ్వరరెడ్డి, పాతూరు నాగ, పెన్నా వెంకటేశ్వర్లు, కనమర్ల కృష్ణారెడ్డి, కేఎస్ఎస్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గానుగపెంట పంచాయతీలో ఉచిత కంటి వైద్య శిబిరం



**కనిగిరి, జూన్ 17, ప్రభాతవార్త**

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గానుగపెంట పంచాయతీల్లో శంకర నేత్రాలయం ఆసుపత్రి, జనని చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా గానుగపెంట మాజీ సర్పంచ్ షేక్ బుడే సాహెబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగలేరు ప్రజలు కూడా పాల్గొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలలో కొంత మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని వైద్య బృందం నిర్ధారించింది. వారికి త్వరలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన శంకర్ నేత్రాలయం ఆసుపత్రి వైద్య సిబ్బందికి, జనని చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విరిగిన స్తంభం.. భయాందోళనలో ప్రయాణికులు



**కనిగిరి, జూన్ 17, ప్రభాతవార్త**

కనిగిరి మండలం కృష్ణాపురం నుంచి చింతలపూడి, నాగులవరం వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభం విరిగి కిందపడటంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం సాయంకాలం వీచిన బలమైన గాలులు, వర్షం కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో కరెంటు తీగలు రోడ్డుకు కేవలం నాలుగు అడుగుల ఎత్తులోనే వేలాడుతూ ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఈ మార్గంలో నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తీగలు రహదారికి అతి సమీపంలో ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విరిగిపోయిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్ తీగలను సురక్షితంగా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

# రైతు బజార్ నిర్మాణానికి రూ. 49.90 లక్షలు మంజూరు



**మార్కాపురం టౌన్, జూన్ 17, ప్రభాతవార్త**

రైతు బజార్ నిర్మాణానికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కార్యాలయం నుండి రూ.49.90 లక్షలు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయినట్లు మార్కెట కమిటీ సెక్రెటరీ జి. కోటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని కలెక్టర్ బంగళా సమీపంలో వున్న 25 సెంట్ల స్థలంలో రైతు బజార్ కు బిల్డింగ్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న రైతు బజార్ బిల్డింగ్ నిర్మాణం మంజూరు కావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కత్తి ప్రహర్షిత్‌ని ఆశీర్వదించిన టీడీపీ నేతలు



**హనుమంతునిపాడు, జూన్ 17, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన హనుమంతునిపాడు గ్రామంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కత్తి తిరుపాలు తమ్ముడు, మాజీ ఉప సర్పంచ్ కత్తి కిశోర్ కుమారుని మొదటి సంవత్సర పుట్టిన రోజు వేడుకలలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, టీడీపీ నాయకులు పల్లాల నారపరెడ్డి, సొసైటీ చైర్మన్ కుందురు నారాయణరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, మనోహర్‌రెడ్డి, వేశపోగు రాజేష్, బాలసాని కోటయ్య, తాతపూడి బుజ్జి, కృపారావు, తదితరులు పాల్గొని చిన్నారి ప్రహర్షిత్‌ని ఆశీర్వదించారు.

# నూతన మొబైల్ షాపును ప్రారంభించిన తహసీల్దార్



**పామూరు, జూన్ 17, ప్రభాతవార్త**

పామూరు పట్టణంలోని స్థానిక మామిడి సెంటర్ వద్ద బుధవారం నాడు నూతనంగా ఏర్పాటు చేసిన విజయ్ మొబైల్ సెంటర్‌ను పామూరు తహసీల్దార్ ఆనాటి లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలని తహసీల్దార్ ఆకాంక్షించారు.



# మార్కాపురం వార్త

## ఎంపీ మాగుంట, మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే కందుల సమక్షంలో టీడీపీలో చేరిన హనీమూన్ శ్రీనివాసరెడ్డి



**పొదిలి, జూన్ 17, ప్రభాతవార్త**

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో పొదిలి మండలం వైకాపా నాయకులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడి (హనీమూన్ శ్రీనివాసరెడ్డి) అనుచరులతో అట్టహాసంగా బుధవారం టీడీపీలో చేరారు. మార్కాపురం మార్కెట్ యార్డులో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి అయిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభ అనంతరం వారి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాంస, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ రసూల్, నాయకులు మల్లారపు వెంకట్రావు, కొనకనమిట్ల మాజీ మండల కన్వీనర్లు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావు, తదితరులు ఉన్నారు.

## సమతుల్య ఎరువుల వాడకంతో ప్రయోజనాలు

**- దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి**

**కొనకనమిట్ల, జూన్ 17, ప్రభాతవార్త**

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు అయిన జీలుగ, పిల్లిపెసరతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని దర్శి కేవీకే విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి పెద్దారికట్లలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలోభాగంగా అవగాహన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. వరి, మొక్కజొన్న, మిరప, శనగ పంటలపై ఎల్‌నినో ప్రభావం చూపుతుందని, మన దేశంలోని జిల్లాలో అధిక రసాయన ఎరువులు వాడుతున్న జిల్లాలో మన ప్రకాశం జిల్లా కూడా ఉందన్నారు. కాబట్టి మన రైతులు అధిక రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఎరువులైన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ, పశువుల ఎరువులు, వానపాముల ఎరువులను వాడడం మంచిదన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఆధారంగా ఎరువులు వాడుకున్నట్లయితే సాగు ఖర్చు తగ్గుతుందని తెలియజేశారు. ఎల్‌నినో ప్రభావం వలన నైరుతి ఋతుపవనాలు మందగించి, తేలికపాటి జల్లులు, వర్షాల విరామం, ఒకే సారి పెద్ద వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడటానికి అవకాశం ఉంటుందని, ఈశాన్య ఋతుపవనాలు కూడా ఆశాజనకంగా ఉండవని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని, కంది, సజ్జ, జొన్న, ఆముదాలు, కొర్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సామర్థ్య వృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ



**పొదిలి, జూన్ 17, ప్రభాతవార్త**

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాలెడ్జ్ పార్ట్నర్ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సహకారంతో పొదిలి నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు సామర్థ్యవృద్ధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పొదిలి నగర పంచాయతీ కమీషనర్ యు.ఆంజనేయులు, మేనేజర్‌ఎస్‌డీ షేక్ వలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.మారుతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ యు.ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతను కాపాడడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి కార్మికులు సురక్షిత పద్ధతులను అనుసరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, వ్యర్థాల వేరువేరు సేకరణ, పారిశుధ్య నిర్వహణ నాణ్యమైన సేవల అందజేతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఏఐఐ ఎల్ ఎస్‌జీ రిసోర్స్ పర్సన్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక మొహరం

**- నేటి నుంచి పీర్ల పండుగ వేడుకలు ప్రారంభం**



**పామూరు, జూన్ 17, ప్రభాతవార్త**

మతసామరస్యానికి చిహ్నంగా దేశంలో హిందు-ముస్లిం ప్రజలు అనాదిగా జరుపుకునే మొహరం (పీర్ల) పండుగను ఈనెల 18 నుండి జరుగుతాయని పీర్ల చావిడీల ముజవర్లు తెలిపారు. ఇస్లాం మత వ్యవస్థాపకుడు హజరత్ మహ్మద్ ప్రవక్త మనవళ్ల ఇమామ్ హసన్, హుసేన్, కాశీం వంశీయుల త్యాగనిరతికి ప్రతీకగా పది రోజుల పాటు ముస్లిం భక్తులు జరుపుకోవడం దేశంలో అనాదిగా వస్తున్న ఆచారం. పద్నాలుగువ శతాబ్దం క్రితమే ప్రజాస్వామ్యం మానవీయ హక్కుల కోసం మహ్మద్ ప్రవక్త స్థాపించిన ఇస్లాం వ్యవస్థ విస్తరణలో భాగంగా కార్బల మైదాన యుద్ధ కతన రంగంలో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అశువులు బాసిన తీరు శత్రువులపై చూపిన మానవీయ విలువలకు నిలువుటద్దంగా నిలిచిన ప్రాణత్యాగాన్ని ప్రతి సంవత్సరం స్మరించుకోవడమే పీర్ల పండుగ ముఖ్య ఉద్దేశం మొహరం నెల ప్రారంభంతో ఇస్లాం నూతన సంవత్సర క్యాలెండర్ ప్రారంభమవుతుంది. అమావాస్య ముగిసి ఆకాశంలో నెలవంక దర్శనమవడంతో మొహరం పండుగ వేడుకలు ప్రారంభమవుతాయి. అందులో భాగంగా 18వ తేదీ గురువారంతో మొదలు కొని 27 శనివారంతో ముగుస్తాయి. కార్యక్రమాల్లో భాగంగా మూడవ రోజు 20వ తేదీన శనివారం పీర్ల పెట్టెలు దించి 22న సోమవారం అగ్నిగుండం త్రవ్వించి 7వ రోజు అనగా 24న చిన్న పీర్ల షరగత్తు, 26న శుక్రవారం పెద్ద పీర్ల షరగత్తు, 27న పీర్లు స్నానంతో వేడుకలు ముగుస్తాయని ముజవర్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని మూడు చావిడీలతో పాటు గోపాలపురం, పడమటకట్టకిందపల్లి, గుమ్మలంపాడు గ్రామాల్లోని చావిడీలకు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దె కార్యక్రమాల్లో మజవర్లు నిగమ్నమయ్యారు.

## కూటమి ప్రభుత్వానికి ప్రజల అండ అవసరం

**- మార్కాపురం విజయోత్సవ సభలో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**- వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కోసం రూ.905 కోట్లు విడుదల**

**- మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు**

**- జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు, మౌలిక సదుపాయాలపై దృష్టి**



**మార్కాపురం, జూన్ 17, ప్రభాతవార్త**

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తోందని, ఈ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మార్కాపురం పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రాజెక్టు పనుల వేగవంతానికి అవసరమైన రూ.905 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మార్కాపురం జిల్లాను రాయలసీమ తరహాలో హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. అలాగే శ్రీశైలం ఘాట్ రోడ్డును నాలుగు లైన్ల కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి ఆమోదం తెలిపారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి రూ.16.84 కోట్లు మంజూరు చేయడంతో పాటు 116 ఆలయాలకు దీప, ధూప, నైవేద్యాల నిర్వహణ కోసం రూ.1.10 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి నెలా ప్రాజెక్టును సందర్శిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పూర్తి కాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించడం ద్వారా ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిందన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కొత్త పరిశ్రమల స్థాపనపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో మార్కాపురం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ జూలై చివరి నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జలధార–జలహారతి, ఎన్టీఆర్ భరోసా, స్త్రీ శక్తి వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. సభకు ముందు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల ప్రత్యేక స్టాల్స్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, బీజేపీ నాయకులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అటవీశాఖ అధికారులు గతంలో పని చేసిన స్నేక్ క్యాచర్‌లను విధులలోకి తీసుకోవాలి







**యర్రగొండపాలెం, జూన్ 17, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధి ప్రాంతంలో పాముల సమస్యలు తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. గ్రామంలో వ్యవసాయం చేసే రైతులు పాములతో పడే ఇబ్బందులు వర్ణాణాతీతం, అలాంటి ఇబ్బందుల సమయంలో అటవీశాఖలో శిక్షణ పొందిన స్నేక్ క్యాచర్లు సమాచారం అందుకున్న వెంటనే అందుబాటులోకివచ్చేవారు, కానీ నేడు అలాంటి పరిస్థితి లేదు. యర్రగొండపాలెం అటవీ క్షేత్రాధికారి కార్యాలయం పరిధిలో పని చేసే స్నేక్‌క్యాచర్లు వైదొలిగినట్లు తెలుస్తుంది. దాంతో వ్యవసాయం చేసే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోను కావాల్సిన పరిస్థితులు దాపురించాయని అంటున్నారు. పట్టణంలోని కొప్పుకొండ కొండారెడ్డి కాలనీలో నివాసముంటున్న రమణ స్వామి ఇంట్లోకి బుధవారం ఉదయం పాము దూరింది. ఇంట్లోకి దూరిన పాము గంటల కొలది కదలకుండగా మెదలకుండా తిష్ట వేసింది. దాంతో ఆ ఇంట్లోని వారు పామును కొట్టలేక, బయటకు తరములేక భయంతో వణిపోయారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందిస్తే, అటవీశాఖ తరుపున పని చేసే స్నేక్ క్యాచర్లు ప్రస్తుతం పని చేయడం లేదని సమాధానం రావడంతో, ఆ ఇంటి యజమానులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. గతంలో ఇలా పాములు ఇళ్ళ పరిసర ప్రాంతాల్లో కనపడిన, ఆవాసాలలోకి దూరినప్పుడు దాన్ని పట్టుకోవడానికి వెంటనే సమీప అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లయితే వెంటనే స్నేక్ క్యాచర్ వచ్చేవారని, పామును సురక్షితంగా పట్టుకొని అటవీప్రాంతానికి తీసుకొని పోయేవారని పలువురు చెబుతున్నారు. అటవీశాఖలో పని చేసే స్నేక్ క్యాచర్ ఇప్పుడు లేరనే విషయం తెలిసిందే. స్నేక్ క్యాచర్‌లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితులు నెలకొని ఉంది. దానికి తాజా ఉదాహరణ ఇక్కడి పరిస్థితే అద్దం పడుతుంది. ఉదయం ఎప్పుడో ఇంట్లోకి దూరిన పాము కదలక మెదలక అలాగే నీటి బకీటుకు చుట్టుకొని ఉండిపోయింది. దాన్ని కొట్టేవారు గాని, తరిమే వారు గాని లేకపోవడంతో ఆ ఇంటిళ్ళిపాది బయందోళనలతో ఇళ్ళు వదిలి రోడ్డు మీదకు వచ్చి నిలబడిపోయారు. అటవీశాఖ అధికారులు, ప్రజలు పడుతున్న ఇలాంటి ఇబ్బందులను గుర్తించి స్నేక్ క్యాచర్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## చెమిడిదపాడులో ఎస్ఐఆర్ సర్వే



**గుడ్లూరు, జూన్ 17, ప్రభాతవార్త**

మండలంలోని చెమిడిదపాడు గ్రామంలో బూత్‌ల వారీగా ఎస్ఐఆర్ సర్వే జరిగింది. 203 బూత్ సర్వే వీఆర్వో వి.రమణ ప్రసాద్(బీఎల్ఓ) సర్వే చేశారు. 204వ బూత్‌లో మహిళా పోలీసు శ్రీ లక్ష్మీ సర్వే నిర్వహించారు. మండలంలో అన్నిగ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న సమాచారం మేరకు జరుగుతున్న సర్వేలో క్షేత్ర స్థాయిలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

**- ప్రైవేటు వైద్యశాలకు తరలింపు**



**పొదిలి, జూన్ 17, ప్రభాతవార్త**

పొదిలి పాతూరు లైన్‌మెన్ పచ్చవ శివరామ కృష్ణ బుధవారం ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల య్యాయి. రాఘవేంద్ర థియేటర్ వెళ్లే దారిలో ఉన్న వాసవి అపార్టుమెంట్ వద్ద విద్యుత్‌ట్రాన్స్ ఫార్మర్ మరమ్మత్తులు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైనట్లు తెలుస్తుంది. మరమ్మత్తులు చేయుటకు కార్యాలయం వద్ద ఎల్‌సీ తీసుకొని మరమ్మత్తులు చేస్తున్నప్పటికి విద్యుత్‌ప్రమాదానికి గురికావడం ఆశ్యర్యం కలిగిస్తుందని పలువురు అంటున్నారు 70 శాతం కాలిన తీవ్రగాయాలైన లైన్‌మెన్ శివరామకృష్ణ పరిస్థితి తీవ్రవిషమంగా ఉండటంతో పొదిలి ప్రైవేటు వైద్యశాల నుండి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుతరలించారు. విద్యుత్ ప్రమాదంపై విద్యుత్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జిల్లా కేంద్రం అయినా దుస్థితి మారలేదు

**- ట్రాఫిక్, గుంతలు, పశువులతో ప్రజలకు నరకయాతన**

**- "జిల్లా ప్రకటన తర్వాత మారిందేమిటి?" అంటూ ప్రజల్లో చర్చ**

**మార్కాపురం, జూన్ 17, ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంగా ప్రకటించిన తర్వాత మార్కాపురం పట్టణం అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని ప్రజలు ఆశించినా, ప్రస్తుతం పట్టణంలో నెలకొన్న పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు తోడు సాగర్ నీటి పైపులైన్ పనుల కోసం రహదారులపై తవ్విన గుంతలు, విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు, ఆవులు, రోడ్లపైనే నిలిపివేస్తున్న వాహనాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులైన మార్కెట్ రోడ్, నెహ్రూ బజార్, వెంకటరమణ ఫోటో స్టూడియో లైన్, ఎల్ఐసీ బజార్, కంభం రోడ్, అమ్మవారి శాల రోడ్, తూర్పు వీధి, సత్యనారాయణ స్వామి వీధి, జగదీశ్వరి థియేటర్ రోడ్, విజయ టాకీస్ రోడ్, ఎన్ఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకవైపు సాగర్ నీటి పనుల కోసం తవ్విన గుంతలువాహనదారులకు ప్రమాదకరంగా మారగా, మరోవైపు రోడ్లపై స్వేచ్ఛగా సంచరిస్తున్న ఆవులు, కుక్కలు తరచూ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నాయి. ఇదే సమయంలో బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థల వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, రిక్షాలు రోడ్లపైనే పార్క్ చేయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ప్రధాన కూడళ్లలో చిన్నపాటి ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారిపోయాయి. అత్యవసర పనుల కోసం వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అంబులెన్సులు వంటి అత్యవసర వాహనాల రాకపోకలకు కూడా ఆటంకాలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ప్రకటించిన తరువాత పరిపాలనా పరంగా అనేక మార్పులు వస్తాయని ఆశించిన ప్రజలు, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను చూస్తూ "మార్కాపురం జిల్లా కేంద్రం అయిన తర్వాత మారిందేమిటి?", "అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోంది?" అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. టీ దుకాణాలు, వ్యాపార కేంద్రాలు, సామాజిక వేదికల వద్ద ఇదే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వ్యవస్థ, రహదారుల మరమ్మతులు, వీధి పశువుల నియంత్రణ వంటి అంశాలపై అధికారులు తక్షణమే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే రానున్న రోజుల్లో సమస్యలు మరింత జటిలమై ప్రజల అసంతృప్తి పెరిగేఅవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. "జిల్లా హోదా వచ్చినా ప్రజల ఇబ్బందులు తగ్గకపోతే ఆ హోదా వల్ల సామాన్యులకు ప్రయోజనం ఏమిటి?" అనే ప్రశ్న ప్రస్తుతం మార్కాపురం ప్రజల్లో గట్టిగా వినిపిస్తోంది.

ong-8_ong-8.qxd 6/17/2026 11:13 PM Page 1



# కూటమి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి..సంక్షేమం ముందంజ

*- సంతనూతలపాడు నియోజకవర్గ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే విజయ్ కుమార్*

*- టీడీపీ నేతలు,మహిళలతో విజయవంతమైన నియోజకవర్గ టీడీపీ విజయోత్సవ సభ*

**సంతనూతలపాడు, జూన్ 17, ప్రభాతవార్త**

ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ముఖ్యంగాఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారధ్యంలో రాష్ట్రంలో రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వ పరిపాలనలో అభివృద్ధి సంక్షేమం ముందంజలో ఉన్నట్టు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పాల కేంద్రం వద్ద గల మాజీ సర్పంచ్ రావూరి లింగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వ పరిపాలన విజయోత్సవ సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు అలియాస్ పీఎస్ఆర్ మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల మాజీ వైస్ ఎంపీపీ టీడీపీ నాయకులు వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు. ముఖ్యంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అభివృద్ధి- సంక్షేమం మరింతగా ముందంజలో ఉన్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. నియోజకవర్గంలో నేటి వరకు ముఖ్యంగా సుమారు 100 కోట్ల రూపాయలు పైగా నిధులతో పలు రంగాలను అభివృద్ధి పరిచినట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా ఎన్నికల ముందు వాగ్దానాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించడం ఒక వరమని ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. 20కోట్ల రూపాయలకు పైగా అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అర్హులైన లబ్దిదారులందరికి ఎన్టీఆర్



భరోసా పెన్షన్‌లను కల్పిస్తామని ఎమ్మెల్యే విజయ్ కుమార్ తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో నియోజకవర్గంలో మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగేందుకు కృషి చేసిన టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, అలియాస్ పీఎస్ఆర్, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, అబ్బూరి శ్రీనివాసరావు తదితరులకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మరొక ముఖ్య అతిధిగా నియోజకవర్గ పరిశీలకులు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు హాజరయ్యారు. మొదట ఎన్టీఆర్ విగ్రహానికి, ఎమ్మెల్యే విజయ్ కుమార్, పరిశీలకులు నాగమల్లేశ్వరరావులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తదుపరి జ్యోతి ప్రజ్వలన గావించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక వైసీపీ రకరకాలుగా కుట్రలు పన్నుతున్నట్లు నియోజకవర్గ పరిశీలకులు శివనాగమల్లేశ్వరరావు తన ప్రసంగంలో ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి గతంలో వచ్చిన 11 సీట్లు కూడా కరువు అవుతాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పరిపాలనలో అన్ని రంగాల్లో ఘన విజయం సాధిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాసరావు, సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు అలియాస్ బాబు తమ ప్రసంగాల్లో వెల్లడించారు. సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో




జరిగిన ఈ విజయోత్సవ సభకు సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల నుండి టీడీపీ నేతలు, మహిళలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. మొదట ఎమ్మెల్యే విజయ్ కుమార్, నియోజకవవర్గ పరిశీలకులు శివనాగమల్లేశ్వరరావులను సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు అలియాస్ పీఎస్ఆర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున ప్లెక్సీలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతిబాబు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, తెళ్ళ మనోజ్ కుమార్‌లు, జిల్లా బీజేపీ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ మాజీ సమన్వయకర్త కందుకూరి బాబు, బాపట్ల పార్లమెంటు టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి అప్పల కుమార్ స్వామి, పార్లమెంట్ సెక్రటరీ కే.విజయమ్మ, బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎన్నారై తక్కెళ్ళపాడు రమేష్, నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు జి.శివ పార్వతి, బీజేపీ మండల అధ్యక్షులు బాలినేని కళ్యాణ్‌రెడ్డి, బీజేపీ బాపట్ల పార్లమెంటు ఎస్సీ మోర్చా నాయకులు బత్తుల ఆనంద్ కుమార్ తదితరులు బందోబస్తును పర్యవేక్షించారు.

## వాటర్ డిస్పెన్సర్ బహుకరణ హెచ్.ఎం.ఇమ్మడిశెట్టి అనిత

**జె. పంగులూరు, జూన్ 17, ప్రభాతవార్త**



దాతలు అందిస్తున్న బహుమతులు మా పాఠశాల విలువలను పెంచి, మాపై మా అద్యాపకులపై మరింత నాణ్యమైన భోధన అందించే బాధ్యతలు పెరిగాయని హెచ్.ఎం. అనిత అన్నారు. మండలంలోని కొండమూరు వాస్తవ్యులు బొగ్గవరపు శ్రీనివాసరావు ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్న ఎన్నారై కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదివేల రూపాయల విలువ గల వాటర్ డిస్పెన్సర్ ను బహుకరించగా వారి తల్లి బొగ్గవరపు చిన్నమ్మాయి పాఠశాలకు వచ్చి వాటర్ డిస్పెన్సర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్.ఎం. ఇమ్మడిశెట్టి అనిత మాట్లాడుతూ ఎంతో దూరంలో ఉన్నా దాతలు సహృదయంతో అందిస్తున్న బహుకరణతో విద్యార్థిని, విద్యార్థులకు దహాతిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారికి ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకట్రావు, గ్రామస్తులు, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సిడిపిఓ

**వలేటివారిపాలెం. జూన్ 17. ప్రభాతవార్త**



మండల పరిధిలోని చుండి, కలవళ్ల గ్రామాలలో సూపర్‌వైజర్‌లు సునీత. ప్రభావతి అధ్యక్షతన జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిడిపిఓ కె ఉషారాణి ఎంఈఓలు పీ. మాల్యాద్రిరెడ్డి, మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంఈఓ మాల్యాద్రిరెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ స్కూల్‌లో ఆటపాటలతో కూడిన విద్యను పిల్లలకు అందించి సమగ్ర అభివృద్ధిని పెంపొందించాలన్నారు. అనంతరం కలవల్ల పాఠశాల నుండి 12 మంది, చుండి నుండి ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలకి 20 మంది చిన్నారులకు సర్టిఫికేట్లు అందించారు. సిడిపిఓ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను అంగన్వాడీ సెంటర్లో చేర్పించాలని అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. ప్రీస్కూలు పిల్లలందరినీ గవర్నమెంట్ స్కూల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్‌యం సోమినేని రవీంద్ర. అంగన్వాడి వర్కర్స్ గోవిందమ్మ. విజయ మల్లిక. అంగన్వాడి టీచర్ రాజ్యలక్ష్మీ. జ్యోతి అంగన్వాడి హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులలో జవాబుదారితనం ఉండాలి.. ఎంపీడీవో కుసుమకుమారి

**బల్లికురవ జూన్ 17( ప్రభాతవార్త)**



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని క్షేత్ర సహాయకులకు ఎంపీడీవో కుసుమ కుమారి సూచించారు. స్థానిక కార్యాలయంలో క్షేత్ర సహాయకులకు సాంకేతిక సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా పని తీరు మెరుగుపడాలన్నారు. పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించటమే లక్ష్యంగా ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి అన్నారు. మాస్టర్ల విధానంలో అవకతవకలకు పాల్పడితే బాధ్యుల నుండి సొమ్ము పూర్తిస్థాయిలో వసూలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పని జరిగే ప్రదేశాలలో మంచినీటి సౌకర్యం విధి గా ఉండాలన్నారు.

## కార్మికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి

**బల్లికురవ జూన్ 17( ప్రభాతవార్త)**



గనులలో పనిచేసే కార్మికుల భద్రతకు యాజమాన్యాలు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని కే ఎస్ ఎస్ రెడ్డి అన్నారు. 23వ గ్రానైట్ గనుల భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం మాజీ మంత్రి సిద్దా రాఘవరావుకు చెందిన లక్ష్మి గ్రానైట్ క్వారీ, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డికి చెందిన శ్రీ శ్రీనివాస గ్రానైట్ క్వారీలలోను తనిఖీ బృందాలు భద్రత కార్యక్రమాలను పరిశీలించాయి. లక్ష్మీ గ్రానైట్ సమన్వయకర్త ఉప్పుటూరి కృష్ణ, గుంటక తిరుపతి రెడ్డిలు తమ గనులలో కార్మికులకు అందజేస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా గని నీ పరిశీలించటంతో పాటు, కార్మికుల వివరాలు సంబంధిత దస్త్రాలను తనిఖీ బృత సభ్యులు పరిశీలించారు. కార్మికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యాజమాన్యం తమకు అందజేస్తున్న సౌకర్యాలను తనిఖీ బృంద సభ్యులకు వివరించారు. ఈ బృందంలో కే వెంకట గణేష్ ,శివ నారాయణ, సురేంద్ర రెడ్డి, నాగూర్ వలీ,లు పాల్గొన్నారు.

## 18న ఒంగోలులో కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ

**అద్దంకి , జూన్ 17, ప్రభాతవార్త :**

ఒంగోలులోని ఎస్‌జివిఎస్ కళ్యాణ మండపంలో ఈనెల 18వ తేదిన ఉదయం 10గంటలకు కూటమి ప్రభుత్వ రెండేళ్ళ విజయోత్సవ సభ జరుగుతుందని అద్దంకి శాసనసభ్యుడు, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంపు కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


**గ్రామ పంచాయితీ కార్యాలయం - మైనంపాడు గ్రామపంచాయితీ**

**సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా.**

**టెండరు ప్రకటన**

మైనంపాడు గ్రామ పంచాయితీకి గాను 2026-27 సంవత్సరమునకు ఈ దిగువ తెలిపిన వరుస నెంబరు 1 నుండి 4వరకు పనులు నెలవారీ కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు తేది: 25-06-2026న ఉదయం 11.00 గం॥లకు మైనంపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ అభివృద్ధి అధికారి గారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరువబడును. సకాలంలో రాని టెండర్లు మరియు ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. ఏ కారణము చూపకనే టెండర్లు వాయిదా లేదా రద్దు పరుచుటకు గ్రామపంచాయితీ అధికారి వారికి పూర్తి అధికారం కలదు. మిగతా అన్ని వివరములు కార్యాలయము పని వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | పని వివరాలు | వర్తించు కాలము | పోస్టులు | ధరావత్తు |
|---|---|---|---|---|
| 1. | స్వీపరు | 01-07-2026 నుండి 30-06-2027 వరకు | 1 | 100 |
| 2. | ఎలక్ట్రిషియన్ | 01-07-2026 నుండి 30-06-2027 వరకు | 2 | 100 |
| 3. | ఆర్.ఓ.ప్లాంట్ ఆపరేటర్ | 01-07-2026 నుండి 30-06-2027 వరకు | 1 | 100 |
| 4. | టర్న్ కాక్ | 01-07-2026 నుండి 30-06-2027 వరకు | 2 | 100 |

**షరతులు:**
1. కాంట్రాక్టు సిబ్బంది గ్రామ పంచాయితీ సిబ్బందిగా పరిగణించబడరు.
2. గ్రామ పంచాయితీ నిధుల సౌలభ్యతను బట్టి మాత్రమే వేతనము చెల్లించబడును
3. పని సంతృప్తికరంగా లేనియెడల సదరు కాంట్రాక్టును రద్దు చేయు అధికారము గ్రామ పంచాయితీ వారికి కలదు.

సం/- పి. వీరాంజనేయులు, పంచాయితీ ప్రత్యేక అధికారి, మైనంపాడు గ్రామ పంచాయితీ, సంతనూతలపాడు (మం), ప్రకాశం జిల్లా

సం/- ఆర్. జ్యోతి, పంచాయితీ అభివృద్ధి అధికారి, మైనంపాడు గ్రామ పంచాయితీ, సంతనూతలపాడు (మం), ప్రకాశం జిల్లా


## జ్ఞాన జ్యోతిని వెలిగించేదే విద్య

**- 465 మందికి నోటు పుస్తకాలు పంపిణీ**

**వేటపాలెం, జూన్ 17, ప్రభాతవార్త**




ప్రతి మనిషి జీవితం లో విద్య ద్వారానే విజ్ఞాన కాంతులు వెలుగుతాయని రిటైర్డ్ స్పేస్ సైంటిస్ట్ డాక్టర్ అండ్ మురళీ వరప్రసాద్ తెలిపారు. వేటపాలెం పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయత్రం సంఘ కార్యాలయంలో 465 మంది విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రాత పుస్తకాల ద్వారా విద్యాసంపార్జను చేస్తే అది చిర స్థాయిగా నిలుస్తుంది అని అన్నారు. అక్షరమనగా నాశనం లేనిదని అర్థమని వివరించారు. సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆయన అభినందనలు తెలిపారు. సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న 7ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 465 మంది విద్యార్థులకు యాబై వేల రూపాయల విలువ గలనోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక విద్యాభివృద్ధికి సంఘం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపన్యాసకులు కుమారి కోసనం నాగమాంబ, జ్యోతిర్మయి దేవాంగ సమితి అధ్యక్షులు డాక్టర్ గౌరబత్తుని రవిబాబు, పట్టబద్దుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ బట్ట మోహన్ రావు,నున్నా శివప్రసాద్,భద్రయ్య, పోతురాజు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సిపిడిసిఎల్ వారి కన్స్యూమర్ విద్యుత్ అదాలత్

**వేటపాలెం, జూన్ 17, ప్రభాతవార్త**



చీరాల విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సును ఏ పి సి పి డి సి ఎల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్ థామస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమం కొత్తపేట రావి జయలక్ష్మి సుబ్బారాయుడు కళ్యాణ మండపం నందు18 వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు జరుగుతుందని, ఫార్మర్ డిస్ట్రిక్ట్ అండ్ స్పెషల్ జడ్జి సి జి ఆర్ ఎఫ్ ఛైర్ పర్సన్ విక్టర్ ఇమ్మానియేల్ మరియు ఫోరం సభ్యులు బాపట్ల సర్కిల్ ఆపరేషన్ సూపరింటెంట్ ఇంజనీర్ ఆంజనేయులు, చీరాల మరియు వేటపాలెం విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశం వినియోగదారులు అందరూ వినియోగించుకొని వారి వారి సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పెరుగు శ్రీనివాసరావు తెలియజేశారు.

## మైనంపాడులో రీసర్వేను పరిశీలించిన రాష్ట్ర, జిల్లా సర్వే అధికారుల బృందం

**సంతనూతలపాడు, జూన్ 17, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం మైనంపాడులో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని బుధవారం కర్నూలు రీజినల్ జాయింట్ డైరక్టర్ ఏ.వెంకటేశ్వరరావు, నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేడీ పర్యటనలో డిప్యూటీ డైరక్టర్ కే.గౌస్ భాషా, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి టీవీ రమణ, జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పరిశుద్ధరావు, సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, మండల సర్వేయర్ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. రైతుల సమక్షంలో రీ సర్వే పారదర్శకంగా జరగాలని కర్నూలు రీజనల్ జాయింట్ డైరక్టర్ వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా ఆదేశించారు. స్థానిక రైతులతో ఈ సర్వే ప్రక్రియపై ఆర్‌జేడీ వెంకటేశ్వరరావు ముఖాముఖి సమీక్షించారు. రీ సర్వే రైతుల సమక్షంలో పక్కాగా జరుగుతుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఈకేవైసీ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకూడదని ఆయన పేర్కొన్నారు. నెట్‌వర్క్ ప్రాబ్లం ఉంటే ఇతర మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శతాబ్దం తరబడి జరుగుతున్న రీ సర్వే చారిత్రాత్మకమైందని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆర్‌జేడీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా ఎటువంటి అవినీతి, పక్షపాతం లేకుండా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో సరిహద్దు వివరాలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం.రాజేష్, మైనంపాడు వీఆర్వో మధు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## సింగరకొండను సందర్శించిన అన్నమయ్య పీఠాధిపతి

**అద్దంకి, జూన్ 17, ప్రభాతవార్త :**



శ్రీరామ జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా శ్రీ అన్నమయ్య పీఠాధిపతి శ్రీ శ్రీ విజయశంకర్ స్వామీజీ తిరుపతి. బుధవారం సింగరకొండ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఉదయం 6 గంటలకు సింగరకొండకు చేరుకున్న వీరు శ్రీరామ జయ రామ జయ జయ రామ అనే నామస్మరణ చేయుటకు ప్రత్యేకంగా సింగరకొండ ను ఎంచుకొని రావటం జరిగిందని వెల్లడించారు. ఈ విధంగా ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, నాలుగు రాష్ట్రాల్లో భక్తి ప్రచార నిమిత్తం ప్రయాణం చేస్తున్నామని, ఇక్కడి నుండి ప్రతినెల పునర్వసు రోజు క్రమం తప్పకుండా మిత్ర భక్త బృందంతో సింగరకొండకు విచ్చేస్తామని వారు అన్నారు. వారితోపాటు ప్రకాశం జిల్లాలోని భక్తులు 100 మంది వారి వెంట విచ్చేసినారు. వారు ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం వారికి స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ చుండూరి మురళి సుధాకర్ శ్రీ శ్రీ విజయ శంకర్ స్వామీజీ నీ, మిత్ర బృందమును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అన్నమయ్య పీఠం తిరుపతి సమర్పించిన "అందరికీ శ్రీహరే అంతరాత్మ అను గ్రంథమును చుండూరి మురళి సుధాకర్ చేతుల మీదుగా అందరికీ అందచేశారు. కార్యక్రమంలో విజయశంకర్ స్వామీజీ మిత్రులైన కావూరి రఘు చందు, మన్నం త్రిమూర్తులు, శంకర్ స్వామి, మల్లికా వల్లభ, రామాంజనేయ స్వామి,వెంకట కృష్ణమ్మ, రాజా రమేష్, జాన్ మాస్టర్, పూజారులు, కిషోర్ గిరిధర్, ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, కోట రామకృష్ణ,గోరంట్ల పుల్లారావు, నర్శెట్టి లీల,బేబీ,కోటేశ్వరమ్మ వున్నారు.

## సింగరకొండలో 4 రాజగోపురాలు, ప్రాకార మండపం

**- నిర్మాణానికి దేవాదాయశాఖ అనుమతులు**

**- త్వరలో మంత్రిచే నిర్మాణ పనులు ప్రారంభం**

**- కార్యనిర్వాహణాధికారి తిమ్మానాయుడు వెల్లడి**

**అద్దంకి, జూన్ 17, ప్రభాతవార్త :**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నాలుగు రాజగోపురాలు, ప్రాకార మండపం నిర్మాణం కొరకు, దేవాదాయశాఖ కమీషనర్ అనుమతులు ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్ మదమంచి తిమ్మానాయుడు వెల్లడించారు. స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో ఈ అనుమతులు లభించినట్లు ఆయన వివరించారు. నాలుగు రాజగోపురాలు, నిర్మాణానికి సంబంధించి, ఇప్పటికే దాతలను సంప్రదించినట్లు ఆయన పేర్కొన్నారు. దేవాలయ పాలకమండలి, అధికారులు, సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఇప్పటికే వారందరి సలహాలు, సూచనలు మేరకు, ఈ అనుమతులు పొందినట్లు తెలిపారు. వీటి నిర్మాణానికి సంబంధించి, ప్లాన్, అంచనాలు, సంబంధించి, దేవాదాయశాఖనుండి అనుమతులు కూడ పూర్తిస్థాయిలో తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. అదే విధంగా ఆలయం వద్ద రాకపోకల విషయంలో ట్రాఫిక్‌కు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్ల విషయమై కూడ సంబంధిత అధికారులకు ప్రతిపాధనలు పంపినట్లు, ఆలయ చుట్టూ గ్రీనిష్ కొరకు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడ చేపట్టనున్నట్లు అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి అనుమతులు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వీటన్నిటికి సంబంధించి, పనులు, చేపట్టేందుకు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుమతితో పనులు మంత్రిచే ప్రారంభించేందుకు ఆయనతో త్వరలో అధికారులు, పాలకమండలి, కలిసి చర్చిస్తుందని, మంత్రి ఇచ్చే సమయాన్ని బట్టి ఆ కార్యక్రమాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తిమ్మానాయుడు తెలిపారు.

## ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టాలి

**దర్శి, జూన్ 17, ప్రభాతవార్త**



మండలంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గొంగటి స్టాలిన్ ఆరోపించారు. బుధవారం దర్శి ఎంఈఓ మాలకొండయ్యకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూస్, ఐడీకార్డ్స్ తదితర వస్తువులను తమ విద్యాసంస్థల్లోనే కొనాలని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నిలువ దోపిడి చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. విద్యను వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ నాయకులు ధనుష్, ఆది, కొండలు, కన్నా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పక్కనపెట్టి కూటమి ప్రభుత్వం విజయాలు చెప్పుకోవడం విడ్డూరం : కైపు వెంకటకృష్ణారెడ్డి


**దర్శి, జూన్ 17, ప్రభాతవార్త**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేకేసీ రాష్ట్ర అధ్యక్షుడు, దర్శి అసెంబ్లీ ఇన్‌చార్జి కైపు వెంకట కృష్ణారెడ్డి విమర్శించారు. దొనకొండ మండలంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, తాగునీరు, సాగునీరు, ఉపాధి గిట్టుబాటు ధరలు వంటి అనేక సమస్యలతో సతమతమవుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రచారాలకే పరిమితమైందన్నారు. ఈ మీడియా సమావేశంలో బీజేపి జయరాజ్(రైల్వే విశ్రాంతి ఉద్యోగుల సమైక్య అధ్యక్షులు), దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం అధ్యక్షులు, దొనకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ గఫూర్, అంబడిపూడి కృష్ణ, గుంటూరు ఏసోబు, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ పక్రియలో పాల్గొనాలి

**దర్శి, జూన్ 17, ప్రభాతవార్త**



దర్శి నియోజకవర్గంలోని ఓటర్లు అందరూ సర్ పక్రియలో పాల్గొనాలని దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దర్శిలోని ఇంటి వద్ద బీఎల్ఓ రాయపాటి శ్రీను ఓటర్ల జాబితా సవరణ ఫారంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ కార్యక్రమం చేపడుతుందని నియోజకవర్గంలోని ప్రతి ఓటరు బీఎల్‌వోలు గ్రామానికి వచ్చినప్పుడు సరైన పత్రాలు అందుబాటులో ఉంచుకొని వారికి సహకరించి మీ ఓట్లను జాబితాలో ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

